
క్లుప్తంగా

శాకంబరి మాతగా భ్రమరాంబికాదేవి అమ్మవారు



సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద ప్రసిద్ధి చెందిన ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో భ్రమరాంబికాదేవి అమ్మవారు ఆదివారం శాకంబరి మాత అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం ప్రధాన అర్చకులు చిట్టేల శివశర్మల నేతృత్వంలో భక్తుల కోరిక మేరకు ఆషాఢమాసంలో భ్రమరాంబికదేవి అమ్మవారిని పూలు, పండ్లు, పలు రకాల కూరగాయలు, వివిధ రకాల ఆకులతో శాకంబరి మాతగా అలంకరించి కుంకుమపూజ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని శాకంబరి మాత అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారి కృపకు పాత్రులై తీర్థప్రసాదాలను స్వీకరించారు. సత్రశాల దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బొద్దూరి బ్రహ్మారెడ్డి, ఈవో గాదె రామిరెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జేజేలు పలికిన జనానికి ప్రభుత్వ విప్ పీఆర్కే కృతజ్ఞతలు

మాచర్ల: దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి 74వ జయంతి కార్యక్రమాన్ని నియోజక వర్గంలో భారీ స్థాయిలో నిర్వహించి ఆయనకు నివాళులర్పించి జేజేలు పలికిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినట్లు పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మహనీయుడు రాజశేఖర్‌రెడ్డి సేవలను ప్రజలు మనసులో ఉంచుకోవడం వల్లనే శనివారం జయంతి కార్యక్రమం వేలాది మందితో అన్నీ ప్రాంతాల్లో జేజేలు పలుకుతున్నారన్నారు. వైఎస్సార్ సేవలు కొనియాడుతూ ప్రజలు పండుగ జరుపుకున్నారన్నారు. నియోజక వర్గంలోని పట్టణం, 5 మండలాల్లో ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు, మహిళలు, యువతకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ ఇదే విధంగా వైఎస్సార్ స్ఫూర్తితో సీఎం జగన్‌ను రెండవ సారి గెలిపించేందుకు అందరూ సర్వం సిద్ధంగా ఉండాలని ఆకాంక్షించారు.

సాగరమాత దేవాలయంలో భక్తుల సందడి



విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాగర్‌మాత పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు జరుగుతున్నాయి. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షణ నిర్వహించారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు జగనన్న సురక్ష

రెంటచింతల: రాష్ట్రంలో అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందించి, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం మంచికల్లు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మీ ఆదివారం తెలిపారు. తహసీల్దార్ కె.పుల్లారావు, ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి, ఈఓపీఆర్డీ సీహెచ్ రామచంద్రావు, డిప్యూటీ తహసీల్దార్ జె.రాజారావు, ఆర్‌డబ్ల్యుస్ ఏఈ కె.నరేంద్రారెడ్డి, ఆర్.డి.కాంతరావు ఈ జగనన్న సురక్ష సమావేశంలో పాల్గొని సంక్షేమ పథకాలు అందని అర్హులైనవారికి పథకాలను అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించి వారికి ధృవీకరణ పత్రాలను అందచేయడం జరుగుతుందన్నారు. గ్రామానికి చెందిన సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అందరూ తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

దుర్గి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం మండల కేంద్రమైన దుర్గి సచివాలయం 1 పరిధిలోని ప్రజలకు శ్రీ వాసవి కల్యాణ మండపంలో ఉదయం 10గం''లకు మండల అధికారులు హాజరై సంబంధిత పత్రాలను అందజేస్తున్నట్లు మండల సచివాలయ కన్వీనర్ బొబ్బా సీతారామిరెడ్డి తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఈ క్యాంపులో పలు ధృవపత్రాలను అందజేస్తారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కలెక్టర్ శివశంకర్



పక్షుల ఆహారం కోసం విత్తనాలు చల్లుతున్న కలెక్టర్ శివశంకర్

కారెంపూడి : కారెంపూడిలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదివారం పర్యటన ఇతర పర్యటనలకు భిన్నంగా స్ఫూర్తిదాయకంగా సాగింది. నాయకురాలు కనువ వద్ద నాగులేరు వాగును పరిశీలించి వాగు చరిత్ర పూర్వాపరాలను పరిశీలించారు. పల్నాడు ఉత్సవాల సమయంలో పల్నాటి వీరాచారవంతులు నాగులేరును పుణ్యనదిగా భావించి పుణ్యస్నానాలు చేస్తారని, నాగులేరు సహజ సిద్ధ నీటి బుగ్గలుండేవని ఇప్పుడు నాగులేరులో నీరు లేని పరిస్థితిని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు విజ్ఞానదాయకంగా పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. ఏమి ఆశించకుండా పర్యావరణ పరిరక్షణకు కొమెర అంకారావు (జాజి)ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని హితవు పలికారు. వృక్షాలను రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని పర్యావరణాన్ని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుందని విద్యార్థులకు చాలా బలంగా వివరించారు. జాజి పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్న కృషిని అభినందించి ఆయనను సన్మానించారు. మనకు మన పరిసరాలలో ఉన్న ప్రతి మొక్కపై అవగాహన ఉండాలని అవి అంతరించి పోకుండా చూసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రభుత్వ పరంగా ఏ సాయం అందిస్తామన్నా వద్దు అని తానొక్కడే ఎంతో శ్రమకోర్చి ప్రజలందరికి మేలు చేకూర్చే పర్యావరణ పరిరక్షణ కోసం జాజి ఏళ్లతరబడి చేస్తున్న కృషి నిజంగా అభినందనీయమన్నారు. ఆయన ఏదో ఒక రోజు అత్యుత్తమ పురస్కారాన్ని అందుకోవడం ఖాయమన్నారు. ప్రస్తుతం పర్యావరణానికి జరుగుతున్న హానిని గమనించి జాజి మొక్కలు పెంచడంపై దృష్టి సారించాలని అలాగే ప్రతి ఒక్కరు ఆలోచన చేస్తే పర్యావరణానికి హాని జరగదన్నారు. మనం పడేసిన వ్యర్థాలను అడవి నుంచి ఏరుతున్న జాజికి ఆ పని లేకుండా ఎవరు వాడిన వాటిని వారే వాటన్నింటిని కవర్లో వేసి పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది సేకరించాలనే చూడాలన్నారు. పక్షుల ఆహారం కోసం జాజి కేటాయించిన 80 సెంట్ల పొలంలో కలెక్టర్ సజ్జ జొన్న విత్తనాలు చల్లారు. ఆ తర్వాత అతని ఇంటికి కలెక్టర్ వెళ్లి జాజి స్థితిగతులను తెలుసుకున్నారు. రోజువారీ విధుల్లో క్షణం తీరికలేకుండా గడిపే కలెక్టర్ ఇలా పర్యావరణ పరిరక్షణకు ప్రజల్లో చైతన్యం కలిగించే వినూత్న కార్యక్రమం అందులోనే ఎవరూ చేయని విధంగా నల్లమల అడవిలో అధికారులు విద్యార్థులతో కలియ తిరిగి స్వయంగా కలెక్టరే విత్తనాలు చల్లే కార్యక్రమంలో పాల్గొని అందరిలో పర్యావరణ పరిరక్షణ స్ఫూర్తిని రగిలించారు.



జాజిని సన్మానిస్తున్న కలెక్టర్ శివశంకర్

రహదారులకు మహర్దశ

- రూ. 13 కోట్ల 40 లక్షలు మంజూరు
- త్వరలో పనులు ప్రారంభం



అధ్వానంగా ఉన్న పిన్నెల్లి టు లక్ష్మీపురం ఆర్‌అండ్‌బి రోడ్డు

గురజాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రహదారులను అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి చొరవతో రహదారుల ఏర్పాటుకు మరమ్మతులు చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో అద్వాన్నంగా ఉన్న ఆర్‌అండ్‌బి రహదారులకు మహర్దశ పట్టనున్నాయి. అద్వాన్నంగా ఉన్న రహదారులను గుర్తించి ఆర్‌అండ్‌బి అధికారులతో మరమ్మతులు చేసేవిధంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రణాళికలు రూపొందించారు. గత ప్రభుత్వం హయాంలో ఏ రోడ్డు చూసినా గుంతల మయంగా దర్శనమిచ్చేవి. అటువంటి రోడ్లను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అద్దంలా తీర్చిదిద్దనున్నాయి. గత పాలకులు నిర్లక్ష్యం కారణంగా శిథిలావస్థకు చేరిన రహదారులను సైతం మరమ్మతులు చేసి బాగుపరిచేందుకు ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేస్తుంది. నియోజకవర్గంలోని పలు ఆర్‌అండ్‌బి రహదారులు మోక్షం కలిగించేవిధంగా చర్యలు చేపట్టారు.

అభివృద్ధి చేసే రహదారులు

- పిడుగురాళ్ల మండలంలోని గుళ్లపల్లి టు జూలకల్లు గ్రామం వరకు రూ.4 కోట్లు
- జానపాడు టు పందిటివారిపాలెం వరకు రూ.1 కోటి 50 లక్షలు
- ఎన్నెల్లి గ్రామం టు లక్ష్మీపురం వరకు (తుమ్మల చెరువు చెట్టు వరకు రూ.1 కోటి 20 లక్షలు
- దాచేపల్లి నగర పంచాయతి నుంచి తంగెడ గ్రామం కృష్ణానది వరకు రూ.5 కోట్ల 70 లక్షలు
- కాచవరం టు దాచేపల్లి నగర పంచాయతీ వరకు కేసానుపల్లి మీదుగా రూ. కోటి రూపాయలు

ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్సార్



వెల్దుర్తి: దివంగత మహానేత డా'' వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 74వ జయంతిని మండల కేంద్రమైన వెల్దుర్తిలో శనివారం అర్ధరాత్రి మూడు జిల్లాల యువజన విభాగం కో ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత మహానేత డా'' వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 74వ జయంతిని రైతు దినోత్సవంగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు చింతా శివరామయ్య, మాజీ సర్పంచ్‌లు పులుసు నారాయణరెడ్డి, కేసిరెడ్డి వెంకటరెడ్డి, జూలకంటి నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కేసిరెడ్డి పిచ్చిరెడ్డి, కోట్ల పాపిరెడ్డి, కేసిరెడ్డి నాగిరెడ్డి తదితరులున్నారు.

పోలేరమ్మకు బోనాలు



గురజాల : వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పంటలు బాగా దిగుబడి వచ్చి ఆనందంగా జీవించాలని అకాంక్షిస్తూ ఆషాఢమాసం మూడవ ఆదివారంను పురస్కరించుకుని పోలేరమ్మకు బోనాలు సమర్పించారు. మండల పరిధిలోని జనార్ధనపురం గ్రామంలోని ప్రజలు పోలేరమ్మకు పొంగళ్లు సమర్పించారు. రాఘవాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పోలేరమ్మ దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



పురుషోత్తం గుప్తాకు చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: రాష్ట్రంలో అనారోగ్యానికి గురైన ప్రతి వ్యక్తి జీవితంలో ఇబ్బంది పడకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతో సీఎం జగన్ ఆరోగ్య శ్రీ తో పాటు సీఎం సహాయ నిధి ద్వారా లక్షల మందికి అప్పటికప్పుడే ప్రయోజనం కల్పిస్తున్న గొప్ప వ్యక్తని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రభుత్వ విప్ క్యాంపు కార్యాలయంలో పట్టణంలోని 15వ వార్డుకు చెందిన విడేల పురుషోత్తం గుప్తాకు రూ. లక్ష సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసి ఆరోగ్య పరంగా ఇబ్బందులు ఎదుర్కోవద్దని చెప్పారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆరోగ్య శ్రీ పరిధిలో లేకపోతే అటువంటి వారికి సీఎం నిధుల నుంచి సహాయం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు చిల్లంచర్ల సత్యనారాయణ, రంగా చెన్నయ్య, కౌన్సిలర్ పోలా శ్రీను, వైస్ చైర్మన్‌లు పోలూరి నరసింహారావు, కొత్తమాసు పాండు రంగారావు, బ్రహ్మారావు, తదితరులున్నారు.

బాలికపై అత్యాచారం చేసిన శ్రీనివాసరావును కఠినంగా శిక్షించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

మాచర్ల: దళిత మైనర్ బాలిక పై అత్యాచారం చేసిన కీచకుడు యద్దనపూడి శ్రీనివాసరావును కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ కార్యాలయంలో పోరాట కన్వీనర్ పోలేపల్లి అబ్రహం లింకన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని మాచర్ల కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. పలువురు నేతలు మాట్లాడుతూ దళిత మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి మోసగించిన శ్రీనివాసరావు పై ఏడు నెలలుగా తీవ్ర చర్యలు తీసుకోకుండా బాలిక కు న్యాయం చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నార. ఇప్పటికైనా దళిత మహిళకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు రూబెన్, సీపీఐ నాయకులు బాబురావు, సీపీ ఎం నాయకులు మహేష్, కార్మిక సంఘాల నాయకులు రాము, శోభన్‌కుమార్, రామదాసు, చంద్రం తదితరులున్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ఎన్నికైన విశ్వబ్రాహ్మణ నూతన కార్యవర్గ సభ్యులు

పిడుగురాళ్ల: పట్టణంలోని విశ్వబ్రహ్మేంద్రస్వామి వారి దేవస్థానంలో పట్టణ, మండల విశ్వబ్రాహ్మణ సంఘం కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నెమలి కొండ శ్రీనివాసాచారి అధ్యక్షత వహించారు. స్టీరింగ్ కమిటీ సభ్యులు మిరియాల వీరబ్రహ్మాచారి, సిద్ది గోపాల కృష్ణమూర్తి, నెమలి కొండ శ్రీనివాసచారి, పదిర జగన్నాధం, కొమ్మూరి లక్ష్మణాచారి నూతన కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. దేవాలయ ప్రధాన అర్చకులు కొమ్మూరి విశ్వరూపాచార్యులు వేద స్వస్తితో ప్రారంభించారు. పట్టణ అధ్యక్షులుగా సుతార్ నాగమల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ధర్మవరపు వెంకటాచారి, కోశాధికారి దార్ల ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా ఒప్పిచర్ల అమరలింగాచారి, ముమ్మడి శివరాం ప్రసాద్, పదిరి అమరలింగాచారి, సహాయ కార్యదర్శులుగా వేల్పూరి సైదాచారి, పదిర శ్రీనివాసచారి, చిన్నపల్లి బ్రహ్మయ్య చార్యులు, పిడుగురాళ్ల మండల కమిటీ అధ్యక్షులుగా మల్లెం నాసరాచారి, ప్రధాన కార్యదర్శి రాగి శ్రీనివాసరావు, కోశాధికారి ములుగు రాఘవాచారి, ఉపాధ్యక్షులుగా సిద్దు గోపాల కృష్ణ, మంగళగిరి కోటేశ్వరరావు, ఎలమర్తి శ్రీనివాసారి, సహాయ కార్యదర్శులుగా కటకం రమేష్, రంగు శ్రీనివాసాచారి, మధిర బ్రహ్మయ్య, పట్టణ మండల కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల విశ్వబ్రహ్మణ సోదరులు పాల్గొని నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శుభాకాంక్షలు తెలియజేశారు.

మానసిక దివ్యాంగుల కేంద్రానికి వితరణ



దాచేపల్లి : నారాయణపురం ఫాతిమామాత ప్రత్యేక అవసరాలు కలిగిన మానసిక దివ్యాంగుల కేంద్రానికి దాతలు ఆదివారం వితరణ అందించారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, కొప్పుల రవికుమార్ రూ. 30 వేలు విలువ చేసే టీవీని బహూకరించారు. మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి రూ.10 వేలు, కాచవరం మాజీ సర్పంచ్ కిష్టిపాటి అంకిరెడ్డి రూ. 10వేల నగదును సురక్షిత మంచినీటి పథకం కోసం విరాళం అందించారు. విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. మానసిక దివ్యాంగ విద్యార్థులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని చైర్మన్ సుబ్బమ్మ సాంబయ్య చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, కౌన్సిలర్లు నాగుబండి గురువులు, చాట్ల క్రాంతికుమార్, నాయకులు కొలా జంపాలరెడ్డి, వెంకటరెడ్డి, శ్రీరాములు తదతరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని ఆదుకున్న ఎమ్మెల్యే పీఆర్కే



బాధిత కుటంబాన్ని పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ రామకృష్ణారెడ్డి

కారెంపూడి: ఇటీవల మండలంలోని ఒప్పిచర్లలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇంట్లో ఉన్న వస్తు సామగ్రితో పాటు సొత్తు కూడా కాలిపోయిన పేద బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం పరామర్శించి రూ. 30 వేలు ఆర్థిక సాయం అందించారు. ఒప్పిచర్ల గ్రామంలోని రోడ్డు మీద ఎస్సీ కాలనీకి చెందిన మిద్దెపోగు యాకోబు నివాసం గృహంలోని సామగ్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల పూర్తిగా కాలిపోయాయి. దీంతో బాధితుడు యాకోబు ఇంటికి ప్రభుత్వ విప్ రామకృష్ణారెడ్డి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. యాకోబు కుటుంబం ప్రభుత్వ విప్ పీఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పంగులూరి చిన వెంకటనర్సయ్య, గ్రామ సర్పంచ్ ఇరికెదిండ్ల రమణ కొండలు, మాజీ ఎంపీటీసీ ఓగూరి రామయ్య, మాజీ సర్పంచ్ రామదేని ఆంజనేయులు, ఇరికెదిండ్ల లాజర్, ఎస్సీ నాయకులు మిద్దెపోగు పున్నయ్య పాల్గొన్నారు.

మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తా

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తామని గురజాల శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. కెఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ముగిశాయి. మొదటి బహుమతిని దాచేపల్లి డాన్ డైనమాట్రి నిలిచింది. రెండవ బహుమతిని చెర్రి ఎలయన్స్, మూడవ బహుమతిని దాచేపల్లి హనుమాన్ సీసీ, 4వ బహుమతిని పిడుగురాళ్ల సాక్తో సీసీ సాధించాయి. విజేతలైన జట్లకు ఎమ్మెల్యే కాసు చేతుల మీదుగా ఆర్‌అండ్‌బీ బంగ్లాలో బహుమతులు శనివారం రాత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ...పల్నాడు ప్రాంతంలో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఎంతోమంది ఉన్నారని, వీరి ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని చెప్పారు. ఈ ప్రాంతంలో ఉన్న క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని, మినీ స్టేడియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. క్రీడలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ప్రభుత్వం అందించిన అవకాశాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని రాణించాలని ఎమ్మెల్యే కాసు కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌భాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణ, మాజీ కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, యార్డు డైరెక్టర్ బుగ్గల జానీ, యర్రంశెట్టి సైదారావు, కౌన్సిలర్లు చాట్ల క్రాంతికుమార్, శ్రీరాం పోలు, నాగుబండి గురువులు, మందపాటి వీరారెడ్డి, నాయకులు కొప్పుల రవికుమార్, కల్లూరి లింగయ్య పాల్గొన్నారు.

శాకంబరి అలంకారంలో శ్రీ వాసవి మాత



శాకంబరి అలంకారంలో శ్రీ వాసవి అమ్మవారు



దేవాలయ ప్రాంగణంలో కూరగాయలతో అలంకరణ చేసిన దృశ్యం

మాచర్ల: ఆషాఢమాస సందర్భంగా పట్టణంలోని పాత మాచర్లలో వేంచేసియున్న శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారిని వేలాది కూరగాయలతో శాకంబరిగా అలంకరించిన అనంతరం భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయ అధ్యక్షులు చందోలు నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆర్య వైశ్య మహిళలు ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే అమ్మవారిని అలంకరించి అర్చకులు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 10.30గం''లకు ధూపదీప నైవేద్యాలతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అదే విధంగా దేవాలయంలో వినాయకుడు, శివుడు, వెంకటేశ్వర స్వామి, సత్యనారాయణ స్వామి, ఆంజనేయ స్వామి విగ్రహాలను కూరగాయలతో అలంకరించి ప్రాంగణంలో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

వీరాపురంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



వీరాపురంలో ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

పిడుగురాళ్లరూరల్: మండలంలోని వీరాపురం గ్రామంలో ఆషాఢ మాసం గురుపౌర్ణమిని పురస్కరించుకుని త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆషాఢ మాసంలో చంద్రుడు గుండ్రంగా పెద్దగా ఉండడం వల్ల గురు పౌర్ణమిగా నిర్ణయించి సాక్షాత్తు శ్రీ కృష్ణుడుని జగద్గురువుగా భావించి గురు పూజ చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కటికం సైదారావు, కె. అరుణ, కె. కోటేశ్వరరావు, కె. నారాయణమ్మ, కె. గోపి, డి. శ్రీను, ఎం వీరయ్య, ఎస్. వెంకట లక్ష్మీ, సీహెచ్ అనురాధ, టి. రాఘవ, ఎం. అమర్, బి. చిరంజీవి, బి. శివ, అనంతలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వైరస్‌లను తట్టుకునే రకాలను రైతులు వేసుకోవాలి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లో పత్తి, మిరప పంటలను సాగుచేసే రైతులు వైరస్ తెగుళ్లను తట్టుకునే రకాలకు చెందిన కంపెనీ విత్తనాలతో పంటలను వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పత్తి, మిరప పంటల సాగులో తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పత్తి పంటకు ఎక్కువగా గులాబిరంగు పురుగు తీవ్రనష్టం కలిగిస్తుందన్నారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు గులాబిరంగు పురుగు నివారణకు పిచికారీ మందులను వాడుకోవాలన్నారు. మిరపను సుమారు 82 రకాల వైరస్‌లు ఆశించి నష్టపరుస్తాయని మూడేళ్లుగా పలు జిల్లాలలో మిరపపంటకు ఈ తెగుళ్ల ఆశించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మన రాష్ట్రంలో ఆకు ముడత, కుకుంబర్ మొజాయిక్ వైరస్, మొవ్వకుళ్లు వైరస్‌లు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ముందుగా పంటపొలంలో భూ పరీక్షలు చేయించుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నా యన్నారు. పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని, సేంద్రీయ ఎరవులను వాడి సమతూల్య ఎరువుల యాజమాన్యం పద్ధతులు పాటించిన అధిక దిగుబడులు సాధించవచ్చ న్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీల చెందిన మూడు, నాలుగు రకాల విత్తనాలను రైతులు కొనుగోలు చేసి పంటలను సాగు చేసుకోవాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులను వినియోగించడం వలన తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులను సాధించవచ్చునని పేర్కొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

గురజాల : విభిన్న ప్రతిభావంతులు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని భవిత కేంద్రం ఐఈఆర్టీలు ఏ విజయలక్ష్మీ, బి ఝాన్సీరాణీలు తెలిపారు. ఈనెల 14వ తేదీన గురజాల రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో ఉన్న విభిన్న ప్రతిభావంతులను పరీక్షించి వారికి అవసరమైన పరికరాలు అందించేందుకు ఈ క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని ఈ శిబిరంలో విభిన్న ప్రతిభావంతులకు పింఛన్లు మంజూరుకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ఈ శిబిరానికి సదరం వైద్య ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, రెండు పాప్ పోర్టు సైజు ఫొటోలు, దివ్యాంగుల ఫోన్ నంబరు విధిగా తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వారికి అవసరమైన పరికరాలు పొందాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వినుకొండ(నూజెండ్ల): వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని నిమ్మలబావి బజారుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఒగ్గు శ్రీనివాసరావు(45) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.